క్లుప్తంగా

బీసీ జనభేరి పోస్టర్ ఆవిష్కరణ



నెహ్రూనగర్: బీసీ జనభేరి పోస్టర్‌ను స్థానిక సంఘ కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీసీ సేన జిల్లా అధ్యక్షులు గోలి నాగకుమార్ మాట్లాడుతూ ఈ నెల 22న ఆంధ్రప్రదేశ్ బీసీ సేన ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా మంగళగిరిలో బీసీల హక్కుల కోసం హక్కుల సాధన కోసం బీసీ జనభేరి సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు మల్లికార్జున రావు, ఆంజనేయులు, కుంచాల కిషోర్, విజయలక్ష్మి, వేముల రాము, మణికంఠ, ప్రతాప్ రాజు, తురక రామారావు పాల్గొన్నారు.

నేడు కౌన్సిల్ సమావేశం

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ సాధారణ కౌన్సిల్ సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు కమిషనర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాల్‌లో ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్న సమావేశానికి నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు అధ్యక్షత వహించనున్నట్లు చెప్పారు. సభ్యుల ప్రశ్నలు, ప్రతిపాదనలు, కార్పొరేషన్‌కు సంబంధించిన అంశాలతో కలిపి మొత్తం 185 అంశాలపై చర్చ నిర్వహించనున్నట్లు చెప్పారు.

వడ్డెర సంక్షేమ కమిటీ సభ్యుడిగా అచ్చి కిరణ్

నెహ్రూనగర్: వడ్డెర సంక్షేమ కమిటీ జిల్లా సభ్యుడిగా నగరానికి చెందిన అచ్చి కిరణ్‌ను నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు గురువారం సాయంత్రం తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వడ్డెరల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకురాలు నూరి ఫాతిమా పాల్గొన్నారు.

ఈ నెల 26 వరకు మహీంద్రా మెగా సర్వీస్ క్యాంపు



పాత గుంటూరు: పయనీర్ ఆటోవరల్డ్ గుంటూరు మహీంద్రా షోరూం ఆధ్వర్యంలో గురువారం మహీంద్రా మెగా సర్వీస్ క్యాంపు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఈస్ట్ ట్రాఫిక్ సీఐ ఎండీ నసీర్ బాషా జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహన కాలుష్యం నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. పయనీర్ ఆటోవరల్డ్ సీఈఓ ముమ్మనేని శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ నెల 26 వరకు జరిగే సర్వీస్ క్యాంపులో మహీంద్రా వినియోగదారులు అందరూ సర్వీస్ రాయితీ ఆఫర్లను వినియోగించుకోవాలని తెలిపారు.

వైభవంగా పల్లకి గ్రామోత్సవం



పాత గుంటూరు: కొత్తపేట శ్రీ గణేశ్వరరావు వీధిలోని షిరిడి సాయిబాబా ధ్యాన మందిరం దశాబ్ది వార్షికోత్సవాలలో భాగంగా గురువారం బాబా వారికి నిత్య పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకిలో మేళ తాళాలు, తీన్మార్, కనక తప్పెట్లు, కోలాటాలతో పుర వీధులలో గ్రామోత్సవం నిర్వహించారు. కేవీ సాయిబాబాశర్మ, భక్తి సంగీత విభావరి భక్తులను అలరించింది. అనంతరం తీర్థప్రసాద వితరణ గావించారు. నిర్వాహకులు లక్ష్మీ నరసింహారావు పర్యవేక్షించారు.

18న భక్తి సంగీత విభావరి

పాత గుంటూరు: బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో అన్నమయ్య కళావేదికపై శ్రీసాయిరాగ సంగీత కళాశాల ఆధ్వర్యంలో మహాశివరాత్రి పురస్కరించుకుని 18న శివ గానాలహరి పేరుతో భక్తి సంగీత విభావరి నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మునిపల్లె రమణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో సంగీతాభిమానులు, భక్తులు పాల్గొనాలని కోరారు.

ఆలయంలో చోరీ

గుంటూరు ఈస్ట్: ఆలయంలో చోరీ ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. కృష్ణబాబు కాలనీలో శ్రీఅభయ గణపతి ఆలయంలో ఆలయ ధర్మకర్త నరసింహస్వామి బుధవారం రాత్రి ఆలయానికి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. గురువారం తిరిగి ఆలయానికి వచ్చి చూడగా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఆలయంలో హుండీ కనిపించలేదు. హుండీలోని రూ.10వేలు చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మానవ జీవితంలో విలువలు ఎంతో ముఖ్యం



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న విశ్రాంత ప్రొఫెసర్ సీతారామమ్మ

గుంటూరు ఎడ్యుకేషన్: మానవ జీవితంలో విలువలు ఎంతో ముఖ్యమని ఏఎన్‌యూ బుద్ధిజం విభాగ విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ జె.సీతారామమ్మ పేర్కొన్నారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో ఎడ్యుకేషనల్ సెల్, ఐక్యూఏసీ సంయుక్తంగా హ్యూమన్ వాల్యూస్ అండ్ ఎథిక్స్ అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న సీతారామమ్మ మాట్లాడుతూ ప్రతి మనిషిలోనూ ఓర్పు, సహనం, క్రమశిక్షణ, ఒకరిపై ఒకరికి గౌరవం కలిగి ఉన్నప్పుడే మెరుగైన సమాజాన్ని నిర్మించగలమని అన్నారు. విశ్రాంత ఆంగ్ల అధ్యాపకురాలు ఎస్.పార్వతి మాట్లాడుతూ ప్రకృతితో మమైకమైన జీవన విధానాన్ని గడపాలని సూచించారు. ప్రభుత్వ మహిళా కళాశాల ఆంగ్ల అధ్యాపకురాలు డాక్టర్ జి.శేషు మాట్లాడుతూ స్వార్థపూరితమైన జీవన విధానాన్ని విడనాడాలని, ప్రేమపూరితమైన జీవిత దైనందిన జీవితంలో గడపాలని, నిరంతరం నేర్చుకోవాలని సూచించారు. ఈసందర్భంగా కొన్ని విలువలను గురించి వివరించారు. కార్యక్రమంలో వాల్యూ ఎడ్యుకేషన్ సెల్ కన్వీనర్ బి.క్యూరీ, ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ డి.మధుసూదనరావు, కళాశాల అకడమిక్ సమన్వయకర్త డాక్టర్ పద్మజ, డాక్టర వి.నవీన్‌కుమార్, బి.లలిత బాబు, జి.కేథరిన్, బి.జాస్మిన్, ఎన్ఎస్ఎస్ సమన్వకర్త ఎం.విజయలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

ఏఎన్‌యూ కాలేజ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ డీన్ మధుబాబు



ఏఎన్‌యూ కాలేజ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ డీన్ మధుబాబు జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

గుంటూరు ఎడ్యుకేషన్: మేనేజ్‌మెంట్ విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఏఎన్‌యూ కాలేజ్ డెవలప్‌మెంట్ బోర్డు కౌన్సిల్ డీన్ ప్రొఫెసర్ కె.మధుబాబు పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులకు వ్యాపార ప్రణాళిక రూపకల్పనపై 'సృజన–మీలో ఎవరు ఎంటర్‌ప్రెన్యూర్' పేరుతో పోటీలను గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మధుబాబు మాట్లాడుతూ పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు విద్యార్థులకు పుష్కలమైన అవకాశాలున్నాయని చెప్పారు. పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ప్రధానంగా లక్ష్యసాధన దిశగా ఆలోచనలు చేయడం, ఎంచుకున్న వ్యాపార ఆలోచన భిన్నంగా ఉండాలని సూచించారు. బృంద ఆలోచనలను నిర్ణయాలు తీసుకునే సమయంలో పరిగణలోకి తీసుకోవాలని, అప్పుడే విజయపథం వైపు అడుగులు వేసి విజేతలుగా నిలుస్తారని తెలిపారు. ఎస్‌బీఐ ముత్యాలరెడ్డినగర్ శాఖ సీనియర్ మేనేజర్ బాబీ పియర్స్ మూల్పూర్ మాట్లాడుతూ ఒక పారిశ్రామికవేత్తగా ఎదగాలంటే, వారి ఆలోచనలే కాకుండా సమర్థవంతమైన వ్యాపార ప్రణాళిక అనేది అతి ముఖ్యమైన అంశాలుగా చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకత, వ్యాపార దక్షత, సరళమైన ఆలోచనా విధానాన్ని పోటీతత్వంతో పరిసరాల్లో జరుగుతున్న మార్పులపై పట్టు సాధించాలని అన్నారు. బృందంతో కలిసి పని చేయడం వంటి అంశాలతో ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులకు రెండు రోజుల పాటు ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి కన్వీనర్‌గా డి.కల్యాణి, కో–కన్వీనర్‌గా డాక్టర్ కె.లలిత వ్యవహరిస్తుండగా, ఎంబీఏ హెచ్‌ఓడీ వి.చక్రవర్తి, అధ్యాపకులు సీహెచ్ వైష్ణవి, సీహెచ్ వేదవతి, ఏ బాజీబాబు, డాక్టర్ ఎన్.అశోక్ బాబు, పద్మావతి, కె.అభిలాష్, బి.అనిత పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: వ్యక్తి ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. బ్రాడీపేటలో నివసించే కోటా మణికంఠ(26) వ్యాపారంలో నష్టం వచ్చి మానసికంగా కృంగిపోయాడు. బుధవారం రాత్రి వంట గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతిచెందాడు. ఆలస్యంగా గుర్తించిన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

బాలిక అదృశ్యంపై కేసు

గుంటూరు ఈస్ట్: బాలిక కనిపించకుండా పోయిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. వసంతరాయపురంలో నివసించే ఓ కుటుంబానికి చెందిన బాలిక ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. బాలిక ఆచూకి కోసం వెతికిన కుటుంబ సభ్యులు కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకుని గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎంటర్‌పెన్యూర్‌షిప్ అభివృద్ధిలో సాఫ్ట్ స్కిల్స్ ముఖ్యం

గుంటూరు రూరల్: ఎంటర్‌పెన్యూర్‌షిప్ అభివృద్ధిలో సాఫ్ట్ స్కిల్స్ ఎంతో అవసరమని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం కమ్యూనిటీ సైన్స్ కళాశాల డీన్ సీహెచ్. చిరంజీవి తెలిపారు. నగర శివారు లాంఫాం నందున్న హోమ్ సైన్స్ కళాశాలలో గురువారం అగ్రి గ్రాడ్యుయేట్లలో ఎంటర్‌పెన్యూర్‌షిప్‌కు అవసరమయ్యే సాఫ్ట్ స్కిల్స్ అభివృద్ధికి ఒక్కరోజు వర్క్‌షాపును నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ చైతన్యకుమారి పాల్గొన్నారు

క్రికెట్ విన్నర్ రోలింగ్ ట్రోఫీ విజేత ఆర్‌వీఆర్‌జేసీ

గుంటూరు రూరల్: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమని ఆర్‌వీఆర్ జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు ఆర్. శ్రీనివాస్ తెలిపారు. చౌడవరంలోని కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన క్రీడాకారుల అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇటీవల బాపట్లలోని బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల క్రికెట్ బాలుర పోటీల్లో తమ కళాశాల జట్టు ఉత్తమ ప్రతిభను కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచి విన్నర్ రోలింగ్ ట్రోఫీని కైవశం చేసుకుందని తెలిపారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ అభినందించారు.

న్యాయవాదిపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: ఫిర్యాదుదారుడిని నమ్మించి నగదు అధిక మొత్తంలో తీపుకున్న న్యాయవాదిపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. శ్రీనివాసరావుతోటకు చెందిన గుండాల వెంకటేశ్వరరావు, కృష్ణా జిల్లా పెనుగంచిప్రోలు మండలం విద్యుత్‌శాఖ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో వెంకటేశ్వరావుపై అభియోగం కింద స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. ఈ విషయమై వెంకటేశ్వరరావు భార్య రత్నమాల గుంటూరు బార్ అసోసియేషన్‌కు చెందిన బోళ్ల బాలాజీ అనే న్యాయవాదిని ఆశ్రయించింది. కేసుకు సంబంధించి న్యాయవాది బాలాజీ, వెంకటేశ్వరరావు వద్ద నుంచి రూ.1,50,000 ఫీజు తీసుకున్నాడు. కేసు విషయంలో ఎటువంటి పురోగతి లేదు. దీంతో విసుగు చెందిన రత్నమాల మరో న్యాయవాదిని సంప్రదించి కేసు పరిష్కరించుకుంది. కేసు విషయంలో ఎటువంటి ఫలితం చూపని న్యాయవాదిని తన పైకాన్ని తనకు ఇవ్వమని కోరగా అతను దుర్భాషలాడాడు. దీంతో రత్నమాల పోలీసులకు గురువారం ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏథర్ ఎలక్ట్రిక్ స్కూటర్ మార్కెట్‌లోకి విడుదల



షోరూంను ప్రారంభించి స్కూటర్‌ను వినియోగదారుడికి అందించిన డీటీసీ కరీం

పాత గుంటూరు: అమరావతి రోడ్డులో నూతనంగా ఏర్పాటైన పవన్ ఎలక్ట్రోమోటివ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో సరికొత్త ఎలక్ట్రిక్ స్కూటర్ ఏథర్ 450ఎక్స్ వాహనాన్ని రవాణాశాఖ డెప్యూటీ కమిషనర్ షేక్ కరీం ప్రారంభించి వాహనాన్ని మొదటి వినియోగదారుడికి అందించారు. డీటీసీ కరీం మాట్లాడుతూ పర్యావరణానికి మేలు చేసే ద్విచక్ర వాహనాలను క్వాలిటీ ప్రధానంగా, ఒకసారి చార్జింగ్ చేస్తే ఎక్కువ దూరం ప్రయాణించే ఎలక్ట్రిక్ వాహనం ఏథర్ 450 ఎక్స్‌ను జిల్లాలోని వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చిన షోరూం యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. సంస్థ ఎండీ చుక్కపల్లి కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఏథర్ 450ఎక్స్ 3.7కెవి పవర్‌ఫుల్ బ్యాటరీ కెపాసిటీతో 146 కిలోమీటర్ల చార్జింగ్ రేంజ్, నాలుగు డ్రైవ్ మోడ్, గంటకు 90 కిలోమీటర్ల వేగంతో వాహనం అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. 3 సెకన్లలో 40 కిలోమీటర్ల వేగం అందుకుంటుందని తెలిపారు. ఏడ డుగుల టచ్ స్క్రీన్, గూగుల్ మ్యాప్ నావిగేషన్, రివర్స్‌గేర్ సౌకర్యం కలిగిఉందని అన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ గుర్రం హనుమంతరావు, షోరూం మేనేజరు అనూష పాల్గొన్నారు.

ఘనంగా మలబార్ గోల్డ్ వార్షికోత్సవం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న షోరూం ప్రతినిధులు, యువకులు

పాత గుంటూరు: దేశంలోనే అతిపెద్ద బంగారం, వజ్రాభరణాల రిటైల్ వ్యాపార సంస్థల్లో ఒకటైన మలబార్ గోల్డ్ డైమండ్స్ షోరూం 9వ వార్షికోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం గుంటూరు లక్ష్మీపురంలోని షోరూం ఆవరణలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో నిర్వహించిన యువకులు పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో స్టోర్ డైరెక్టర్ నదీర్, మార్కెటింగ్ మేనేజర్ గోపికిరణ్, గౌరు శిరీష, ప్రజ్వల పాల్గొన్నారు.

మాటలు కాదు.. ప్రోగ్రెస్ కావాలి

కొండేపాడు సెక్రటరీ, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌పై జిల్లా పంచాయతీ అధికారి కేశవరెడ్డి ఆగ్రహం



సిబ్బందిని హెచ్చరిస్తున్న డీపీఓ కేశవరెడ్డి

కొండేపాడు (ప్రత్తిపాడు): 'నాకు కావలసింది మాటలు కాదు.. ప్రోగ్రెస్' అంటూ జిల్లా పంచాయతీ అధికారి ఆర్. కేశవరెడ్డి అన్నారు. మండలంలోని కొండేపాడు జగనన్న హౌసింగ్ లేఅవుట్‌ను గురువారం ఆయన ఎంపీడీవో, హౌసింగ్ ఏఈలతో కలసి పరిశీలించారు. ఒకే ఒక్క ఇల్లు నిర్మాణం పూర్తయి ఉండటం, మిగిలినవన్నీ పునాదుల దశలోనే ఉండటంతో ఇంజినీరింగ్ అసిస్టెంట్ వెంకట్‌ను ప్రశ్నించారు. లేఅవుట్‌లోని అంతర్గత రోడ్డు అస్తవ్యస్తంగా ఉండటంతో వాహనాలు దిగబడేలా ఉన్నాయని, మెటీరియల్‌ను తోలుకునేందుకు లబ్ధిదారులు ముందుకు రావడం లేదని వెంకట్ చెప్పారు. దీంతో ఈ కాలంలో వాహనాలు దిగబడేలా ఉండటమేంటని, ఇప్పుడే ఇలా ఉంటే వర్షాలు పడితే పరిస్థితి ఏమిటని అసహనం వ్యక్తం చేశారు. పొక్లెయినర్‌తో ఒక గంట రెండు గంటల పాటు పనులు చేయించి ఎత్తుపల్లాలను సరిచేయిస్తే సాఫీగా వాహనాలు లేఅవుట్ లోపలకు వస్తాయి కదా అంటూ డీపీవో మరోమారు ప్రశ్నించడంతో వారి నుంచి సమాధానం కరువైంది. సర్పంచ్‌తో చెప్పి వెంటనే పనులు చేయించి ట్రాక్టర్లు వచ్చేలా చేయించాలని సెక్రటరీకి సూచించారు. సర్పంచ్ నిధుల సమస్య ఉందని చెబుతున్నారని సెక్రటరీ శ్వేత డీపీవోకు చెప్పారు. పది వేలు కూడా అవ్వని పనులకు కూడా ఇలా చెబితే ఎలాగని, ముందు అత్యవసరంగా పొక్లెయినర్‌ను పిలిపించి రోడ్డు బాగు చేయించాలని ఆదేశించారు. సర్పంచ్ డబ్బులు ఇవ్వలేను అని అన్న పక్షంలో తన జీతం నుంచి ఇస్తానని చెప్పారు. సోమవారానికి ట్రాక్టర్ తిరిగేలా రోడ్డును బాగు చేస్తే చాలని చెప్పారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించి వారు ఇళ్లు నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

20న డయల్ యువర్ కార్పొరేటర్

నగరంపాలెం: ఈనెల 20వ తేదీ డయల్ యువర్ కార్పొరేటర్ నిర్వహించనున్నట్లు 18వ డివిజన్ కార్పొరేటర్ నిమ్మల వెంకట రమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. 85000 06458 ఫోన్‌కు సంప్రదించాలని కోరారు.

బాల్య వివాహాలతో అనర్థం

పెదకాకాని: బాల్య వివాహాల వల్ల బాలికలు శారీరకంగా, మానసికంగా ఎదుగుదలను కోల్పోతారని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ శ్రీదేవి తెలిపారు. పెదకాకాని మండల పరిధిలోని కొప్పురావూరు జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బాలికలకు బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలు, పౌష్టికాహారంపై వివరించారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల బాలికల్లో ఎదుగుదల లేకపోవడంతో కుటుంబ, ఆరోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు. పౌష్టికాహారం లోపం వల్ల వ్యాధి నిరోధకశక్తి తగ్గి అనారోగ్యానికి గురవుతారని వివరించారు. బాలికలు ఎక్కువగా నువ్వులు, వేరుశనగ, సున్ని ఉండలు, చిన్నప్పటి నుంచి ఆకుకూరలు, సీ విటమిన్స్ ఆహారం ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. బయట దొరికే ఆహార పదార్థాలు తినకూడదని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభాకరరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఒ. కోటేశ్వరి, కె. ఝాన్సీ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతి ప్రదానం



గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాలలో క్విజ్–వక్తృత్వ–వ్యాసరచన నిర్వహణ సమితి ఆధ్వర్యంలో విద్యార్థి బృందాలకు నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు గురువారం బహుమతి ప్రదానం చేశారు. ఆయా పోటీల్లో ప్రిలిమినరీ రౌండ్‌లో 27 జట్లకు నిర్వహించిన పోటీల్లో ఫైనల్స్‌కు వచ్చిన ఐదు బృందాలకు పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా బీకాం ద్వితీయ సంవత్సర విద్యార్థి పి.జయంత్, బీబీఏ ద్వితీయ సంవత్సర విద్యార్థులు జి.అభిషేక్, కె.పవన్‌కల్యాణ్ ప్రథమస్థానంలో నిలువగా, పి.నికేష్, పి.వెంకటరవి, పి.మమ తద్వితీయ బహు మతి, టి.విజయకుమార్, పి.జగదీష్‌కుమార్, ఎస్.శివాజీ, తృతీయ బహుమతి సాధించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.నాగేశ్వరరావు, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్ఆర్‌కే ప్రసాద్, ఉపాధ్యక్షుడు పి.రామమోహన్‌రావు పాల్గొన్నారు.

ప్రతి పీహెచ్‌సీలో కాన్పులు చేయాలి



డాక్టర్ శ్రావణ్‌బాబును సన్మానిస్తున్న వైద్యులు, వైద్యాధికారులు

గుంటూరు మెడికల్: జిల్లాలోని ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాన్పులు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు ఆదేశించారు. గురువారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో పీహెచ్‌సీ, అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలు చేసేందుకు ఏమైనా అవరోధాలు ఉంటే వాటిని అధిగ మించేందుకు మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. అంటువ్యాధులు ప్రబల కుండా వైద్యాధికారులంతా ముందస్తు చర్యలు తీసుకోవాలని చెప్పారు. మాతా శిశు సంరక్షణ సేవలు, వ్యాధి నిరోధక టీకాలు, సీడీ– ఎన్‌సీడీ సర్వే, స్కూల్‌హెల్త్ కార్యక్రమం, ఎనీమియా ముక్త భారత్, డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాలపై సమీక్ష చేసి పూర్తి స్థాయిలో ప్రజలు ఆరోగ్య సేవలు వినియోగించుకునేలా చూడాలన్నారు. వైద్య అధికారులు, సిబ్బంది, కలిసి కట్టుగా పనిచేసి ఆరోగ్య కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజలు సేవలను వినియోగించుకునేలా చూడాలని చెప్పారు. ఆరోగ్య కార్యక్రమాల అమలులో జిల్లాను ప్రథమ స్థానంలో నిలబెట్టాలని డాక్టర్ శ్రావణ్‌బాబు వెల్లడించారు. ఇటీవల నూతనంగా డీఎంహెచ్‌ఓగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ శ్రావణ్‌బాబును వైద్య అధికారులు, వైద్యులు ఘనంగా సన్మానించారు. సమీక్షలో డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ రత్న మన్మోహన్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య రూపకం



గుడిబండి వెంకటరెడ్డి, పవన్‌కుమార్‌లను సత్కరిస్తున్న సంస్థ నిర్వాహకులు

పాతగుంటూరు: బృందావన గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం ప్రాంగణం అన్నమయ్య కళా వేదికగా కళావిపంచి ఆధ్వర్యంలో గోదాకల్యాణం కూచిపూడి నృత్యరూపకం ఆకట్టుకుంది. కార్యక్రమాన్ని ఆలయ అధ్యక్షులు సి.హెచ్.మస్తానయ్య జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సభకు కళాశాల పోషకులు నూతలపాటి తిరుపతయ్య అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా సెంట్రల్ లేబర్ వెల్ఫేర్ బోర్డు వల్లూరి జయప్రకాష్ నారాయణ పాల్గొన్నారు. ఈసందర్భంగా జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ చైర్మన్ గుడిబండి వెంకట రెడ్డి, శర్మ గ్రూప్ ఎండీ ఎర్రమల్లి పవన్ కుమార్‌లకు పురస్కారాలను అందించి ఘనంగా సత్కరించారు. కూచిపూడి నత్య కార్యక్రమాన్ని అందించిన కళావిపంచి అధ్యక్షుడు బొప్పన నరసింహారావును అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు, కేంద్ర సెన్సార్‌బోర్డు సభ్యుడు కథక్ అంజిబాబు, డాక్టర్ సజనీ వల్లభనేని, నాట్యరత్న రమణి సిద్ధి, డీ తిరుమలేశ్వరరావు, జీ మల్లికార్జునరావు, జీవీజీ శంకర్ పాల్గొన్నారు.

రైలు ఎక్కుతూ మహిళ మృతి



లక్ష్మీపురం: గుంటూరు రైల్వే స్టేషన్‌లో తిరుపతి ఎక్స్‌ప్రెస్ ఎక్కేందుకు వచ్చిన ఓ మహిళ కళ్లు తిరిగి కిందపడి మృతి చెందిన ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. బాధితురాలి కుటుంబ సభ్యులు అందించిన వివరాలు.. ప్రకాశం జిల్లా బేస్తవారి పేట ప్రాంతానికి చెందిన షేక్ రిజ్వానా(36) భర్త షేక్ ఖాజా బుధవారం గుంటూరులోని వారి పిల్లల వద్దకు వచ్చారు. వారితో మాట్లాడి రిజ్వానాకు షుగర్ టెస్టులు చేయించుకున్నారు. గురువారం రైలు నెంబర్ 17261కు తిరుగు ప్రయాణం అయ్యేందుకు భార్యాభర్తలు ఇద్దరు తిరుపతి ఎక్స్‌ప్రెస్ గుంటూరు రైల్వే స్టేషన్‌లోని 2వ నెంబర్ ప్లాట్‌ఫారం వద్దకు చేరుకున్నారు. రైలు సాయంత్రం 4.30 గంటలకు స్టేషన్‌కు చేరుకున్న తక్షణమే దంపతులు రైలు ఎక్కారు. రైలు ఎక్కే సమయంలో షేక్ రిజ్వానాకు కళ్ళు తిరిగినట్లు ఉండటంతో రైలు కిందకు తోటి ప్రయాణికులు సహాయంతో కిందకు దింపారు. ఫిట్స్ లాంటివి వచ్చినట్లు ఉన్నాయని కొంత మంది ప్రయాణికులు వైద్యం చేసేందుకు ప్రయత్నించారు. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది రైల్వే స్టేషన్‌కు చేరుకుని రిజ్వానాను పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు.

స్పందించిన జీఆర్పీ పోలీసులు

మృతి చెందిన రిజ్వానా మృత దేహం సాయంత్రం 4.45 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు కూడా స్టేషన్ అధికారుల నుంచి ఎలాంటి ఫిర్యాదు రాక పోయినప్పటికి మానవతా దృక్పథంతో రైల్వే పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ సమగ్రాస్పత్రికి తరలించారు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని తరలించిన తరువాత కూడా రాత్రి 8.45 గంటలకు స్టేషన్ అధికారులు పనులు అన్ని పూర్తి చేసుకుని ఆర్‌పీఎఫ్ ఫిర్యాదు చేసినట్లు రైల్వే పోలీసులు చెబుతున్నారు.

శైవ క్షేత్రాలకు శివరాత్రి శోభ

- శివరాత్రికి ముస్తాబవుతున్న శివాలయాలు
- జాగారానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్న దేవస్థాన కమిటీలు

ప్రత్తిపాడు: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివాలయాలు ముస్తాబవుతున్నాయి. ఈనెల 18న శనివారం శివరాత్రి పర్వదినం కావడంతో శైవక్షేత్రాల్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. రంగులు వేయించి, పరిసరాలను పరిశుభ్రం చేయిస్తూ దేవస్థాన కమిటీ సభ్యులు, దేవదాయ అధికారులు పనుల్ని ముమ్మరం చేశారు.

ప్రత్తిపాడు శివాలయంలో శాంతి కల్యాణం

స్థానిక శ్రీ గంగా పార్వతీసమేత దండేశ్వరాలయం నూతన శోభను సంతరించుకుంది. మహా శివరాత్రి సందర్భంగా శనివారం తెల్లవారుజామున ఐదు గంటలకు పంచామృత అభిషేకాలు, మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రవారాభిషేకాలు, రాత్రి ఎనిమిది గంటలకు విశ్వబ్రాహ్మణుల అఖండ జ్యోతి, పది గంటలకు శాంతి కల్యాణం, పన్నెండు గంటలకు మహాశివునికి లింగోద్భవకాలంలో అన్నాభిషేక కార్యక్రమాల్ని ఆలయ అర్చకులు పత్తిపాటి పరమేశ్వరశర్మ నేతృత్వంలో నిర్వహించనున్నట్లు చైర్మన్ బాపతు మోహన్‌రెడ్డి చెప్పారు. శివరాత్రి రోజున జాగారం చేసేందుకు వీలుగా భక్తులకు అన్ని ఏర్పాట్లను చేస్తున్నట్లు తెలిపారు. శివరాత్రికి భక్తుల తాకిడి ఎక్కువగా ఉండనుండటంతో ఎలాంటి అసౌకర్యం తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న అసోసియేట్ డీన్ చైతన్యకుమారి

గుంటూరు రూరల్: చిరుధాన్యాలతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం కమ్యూనిటీ సైన్స్ కళాశాల అసోసియేట్ డీన్ ఎం.ఎస్. చైతన్యకుమారి తెలిపారు. లాంఫాంలోని కమ్యూనిటీ సైన్స్ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ విభాగం, భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం సంయుక్త ఆధ్వరంలో ఇంటర్నేషనల్ మిల్లెట్స్ ఇయర్ సందర్భంగా చిరుధాన్యాలపై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేట్ డీన్ మాట్లాడుతూ దేశంలో ఆనాదిగా రైతులు పండిస్తున్న సంప్రదాయ పంటల్లో చిరుధాన్యాలు ప్రధానమైనవని తెలిపారు. వీటిల్లో అధికంగా పీచు పదార్థం, మెగ్నీషయం, ఐరన్, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయని తద్వారా మనిషి ఆరోగ్యం మెరుగు పడుతుందన్నారు. దీర్ఘ కాలిక వ్యాధుల నుంచి బయటపడేందుకు చిరుధాన్యాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నెహ్రూ యువ కేంద్రం అధికారి దేవిరెడ్డి కిరణ్మయి, కె. ధనశ్రీ, ఎం. శిరీష, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్‌నెట్ థింగ్స్‌పై అవగాహన అవసరం

గుంటూరు రూరల్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో స్మార్ట్ జీవన విధానం, ఇంటర్‌నెట్ వినియోగం అధికంగా ఉన్న నేపథ్యంలో ఇంటర్‌నెట్ థింగ్స్‌పై విద్యార్థులకు అవగాహన అవసరమని చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.చంద్రశేఖర్ తెలిపారు. నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో గురువారం ఐటీ ఫర్ టెక్నికల్ అప్లికేషన్స్ స్మార్ట్‌లైఫ్ ఇన్ ఐటీ హబ్స్, ఇంటర్ నెట్ థింగ్స్, సెన్సార్, మాచ్యువేటర్స్, స్మార్ట్ హోమ్స్, రిమోట్ కంట్రోలింగ్ తదితర అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. కళాశాల ఐటీ డిపార్ట్‌మెంట్ జె. భార్గవ్ పాల్గొన్నారు.